క్లుప్తంగా

అలరించిన 'విద్యార్థి మేలుకో'

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బూర్జపాడు ఉన్నత పాఠశాలలో గురువారం ప్రదర్శించిన 'విద్యార్థి మేలుకో' బుర్రకథ అలరించింది. జానపథ కళాకారుడు బాలక లోకనాథం బృందం చెట్ల పెంపకం, మరుగుదొడ్ల వినియోగం, చదువు, ట్రాఫిక్స్ రూల్స్ వంటి సందేశాలను పాటల ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్తు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు సన్మానం

కాశీబుగ్గ: పలాస డివిజన్ పరిధి 108లో పని చేస్తున్న మేనేజర్ జనపాల రవికుమార్‌ను పలాస ఎన్జీవో కార్యాలయంలో గురువారం సత్కరించారు. 108లో పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగంలో చేరనున్న సందర్భంగా ఉద్యోగులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ నజీర్, ఉద్యోగులు సత్యం, లక్ష్మణ్, భాస్కర్, వెంకటరావు, తారక్, గోపి, ఢిల్లి, మురళి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులపై ఒత్తిడి పెంచవద్దు'

ఇచ్ఛాపురం రూరల్: పబ్లిక్ పరీక్షల దృష్ట్యా పదో తరగతి విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి పెంచవద్దని హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ సూచించారు. మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాల గురువారం విడిచిపెట్టిన అనంతరం, ఉపాధ్యాయులతో కలిసి పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కీలకమైన రెండు నెలలు పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

డీహెచ్‌పీఎస్ డైరీ ఆవిష్కరణ

టెక్కలి: మండల కేంద్రంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ ఎల్.రామకృష్ణల చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు వై.గోపి, పి.పోలారావు, జి.చంద్రరావు, బి.అప్పారావు, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రోయిన్ పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బూర్జపాడు, కేశుపురం పంచాయతీ పరిధిలో ఉన్న 1,200 ఎకరాలకు సాగునీరు అందించే కేశుపురం గ్రోయిన్ నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారు. అప్పట్లో తిత్లీ తుఫాన్ ప్రభావంతో ఈదుపురం వద్ద బాహుదా నదిలో కేశుపురం గ్రోయిన్ కొట్టుకుపోయింది. దీంతో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజులు రైతుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందించి తాత్కాలిక గ్రోయిన్ నిర్మాణానికి రూ.28 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

'స్థానికులను కళాసీలుగా నియమించాలి'

కోటబొమ్మాళి: మండలంలో నారాయణవలస గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలో స్థానికులను కళాసీలుగా నియమించాలని సర్పంచ్ గొద్దు చిరంజీవి కోరారు. ఈ మేరకు విజయనగరంలోని ఏపీ ఎస్‌డబ్ల్యూసీ రీజనల్ మేనేజర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. గోదాంలో బస్తాల లోడింగ్, అన్ లోడింగ్ కోసం కాంట్రాక్టర్ కింజరావు హరివరప్రసాద్ స్థానికేతరులను నియమించారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 70 శాతం స్థానికులనే నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాలలో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సుహాస్‌చంద్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు విద్యార్థులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. మంటలను అదుపులోకి తెచ్చే యంత్రాల పనితీరు, వినియోగంపై మెలకువలు నేర్పించారు.

21న మండల సర్వసభ్య సమావేశం

కాశీబుగ్గ: పలాస మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 21 జరగనున్నట్లు పలాస మండల అభివృద్ధి అధికారి రమేష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.30 గంటల నుంచి కాశీబుగ్గలో ఉన్నటువంటి మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

ఇచ్ఛాపురం: పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం గురువారం నిర్వహించారు. రానున్న అమ్మవారి ఉత్సవాలు దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సిబ్బంది పకీరు రాజు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

కంచిలి: కొన్నాయిపుట్టుగ గ్రామంలో జామి ఎల్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. అమ్మవారిని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు అనాది దొళాయి, తలతంపర సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి, వైఎస్సార్‌సీపీ నేతలు భైరవిసాహు, గంగాధర్‌సాహు, చింతామణి సాహు, కులమణి మజ్జి, బిలాయి బెంతొరియా సంఘ ప్రెసిడెంట్ దేవా సాహు తదితరులు దర్శించుకున్నారు.



భక్తుల నీరాజనాలు అందుకుంటున్న వాసుదేవుడు



మందస పురవీధుల్లో స్వామివారి రథోత్సవం

తిరువీధుల మెరిసీ.. దేవదేవుడు

- పురవీధుల్లో ఊరేగిన వాసుదేవుడు
- కనులపండువగా రథోత్సవం
- భక్తిశ్రద్ధలతో చక్రతీర్థం
- భక్తజనసంద్రమైన మందస



శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవునికి చక్రతీర్థం



వాసుదేవుని దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

మందస: అల వైకుంఠంలో ఉన్న శ్రీమన్నారాయణుడు ఇల భక్తుల వద్దకే వెళ్లి పూజలను అందుకున్నాడు. భక్తులు తన్మయత్వంతో వెంటరాగా మంజూష(మందస) పురవీధుల్లో గురువారం ఊరేగాడు. శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, ముడుంబై మధుసూదనాచార్యులు, పవన్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంత్ స్వామిలతో పాటు వేదపండితులు స్వామివారి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు జరుపుకున్న శ్రీవాసుదేవ పెరుమాళ్ మందస పట్టణంలో ఊరేగడం సాంప్రదాయం. స్వామివారికి ప్రజలు స్వాగత నీరాజనాలు పట్టారు. భక్తులు ఆటపాటలతో ముందుకు సాగగా, మహిళలు, యువకులు రంగులను చల్లుతూ ఆనందోత్సాహాల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం రాత్రి ద్వాదశరాధన, శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన కావించారు. కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శానాపతి కిషోర్‌కుమార్, జామి ఈశ్వర వెంకటవరప్రసాదరావు, జల్లు కాశీచరణ్, దేవరశెట్టి మార్కండేయులు, వడ్డి చంద్రశేఖరం, కరతల తిరుపతిరావు, కిల్లంశెట్టి నాగేశ్వరరావు, శ్రీవాసుదేవ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైభవం చక్రతీర్థం

శ్రీవాసుదేవ పెరుమాళుని చక్రతీర్థం, అవభృథస్నానం భక్తిశ్రద్ధలతో భక్తజన సందోహం మధ్య జరిగింది. ఆలయం పక్కనే ఉన్న గోపాలసాగరం ఒడ్డున స్వామివారికి చక్రతీర్థ పూజలుకావించారు. అనంతరం సాగరంలో వేదపండితులు ప్రత్యేక పూజ లు, మంత్రోచ్ఛారణల మధ్య అవభృథస్నానం జరిగి ంది. వాసుదేవుని బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తు లు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. తాత్కాలిక అంగళ్లు, ఎగ్జిబిషన్, విద్యుత్‌దీపాలతో మందస ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఎస్‌ఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజలకు చేరువగా ఉండాలి



నందిగాం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

నందిగాం: గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు గ్రామాల్లోని ప్రజలకు చేరువగా ఉండి, సమస్యలను తెలుసుకోవాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని లఖిదాసుపురం, దిమిలాడ సచివాలయం పరిధిలోని పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలతో సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెండు సచివాలయాల పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న సమస్యలు విన్నారు. అర్హత కలిగిన వారికి పథకాలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయ కన్వీనర్ల చైర్మన్ జడ్యాడ జయరాం, నాయకులు బొంగి హనుమంతురావు, బొంగి మోహనరావు, బాలక మధు, మాదిన గోపాలకృష్ణ, కింతల ధర్మారావు, పోలాకి మోహనరావు, కణితి నారాయణమూర్తి, దీర్ఘాసి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సంతబొమ్మాళి: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాపుగోదాయవలస గ్రామంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ఉన్నతంగా రాణించి రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిథ్యం వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, సర్పంచ్ ఎ.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.అప్పారావు, పి.రామకృష్ణ, ఎస్.భీమారావు, కె.సతీష్, ఎ.మల్లేష్, జనార్దన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



పూజలు చేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బిన్నళమదనాపురంలో జరుగుతున్న జగదీశ్వర ఆలయ పునః ప్రతిష్ట, నవగ్రహ ఆలయ ప్రతిష్టా కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా ఒకే కుటుంబంగా పూజలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ మార్పు భవానీ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.కృష్ణమూర్తి, మార్పు మధుసూదనరావు, వెంకటరమణ, ధర్మారావు, డిక్కల రాజేష్, బొడ్డ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అప్రమత్తత అవసరం

మందస: ఉద్దానంలోని జీడిమామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ శంకర్‌దాసు సూచించారు. మండలంలోని దున్నవూరు, భేతాళపురం, రట్టి, సిగలపుట్టుగ, గెడ్డవూరు తదితర ప్రాంతాల్లో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పొగమంచు విపరీతంగా కురుస్తుండడంతో టీదోమ తెగులు సోకే అవకాశముందన్నారు. జీడిచెట్ల లేత చిగురు, మొగ్గ, పూత, పిందె దశలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తెగుళ్ల నివారణకు వినియోగించాల్సిన మందులు, పిచికారీ చేయాల్సిన విధానాన్ని వివరించారు.

కార్యక్రమంలో సర్పంచ్‌లు తిమ్మల కృష్ణారావు, మామిడి సింహాద్రి, సూరాడ అప్పారావు, లబ్బ సూర్యనారాయణ, దున్న శ్యామ్, అడతాల మనోజ్ కుమార్, వీహెచ్‌ఏలు ఆర్.తులసీరావు, పి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులకు శిక్షణ నేడు

కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం పరిధిలో ఉన్నటువంటి 37 పంచాయతీలకు చెందిన గృహ సారథుల శిక్షణా శిబిరం శుక్రవారం నిర్వహించనున్నట్లు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదలయ్యింది. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవ్వనున్న కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

డిగ్రీతో ఉద్యోగావకాశాలు

ఇచ్ఛాపురం: డిగ్రీతో ఉన్నత ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటాయని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాబిన్‌కుమార్ పాడి అన్నారు. 'ఓపెన్ డే' కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలసి ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు డిగ్రీ విద్యపై గురువారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తిస్థాయిలో సిబ్బందితో పాటు లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ సదుపాయాలు ఉన్నాయన్నారు.

28న క్విజ్ పోటీలు

కవిటి: రాజపురం గ్రామంలో శ్రీశయన చైతన్య యువజన సంఘం ఏర్పాటై 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా గ్రామంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయి ఉన్నత పాఠశాలల క్విజ్ పోటీలను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు సంస్థ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విజేతలకు నగదు, షీల్డ్ బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94919 36865, 97057 98660 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సముద్ర ఉత్పత్తులతో విలువ ఆధారిత పదార్థాలు



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు విజి, మధుసూదనరావు

వజ్రపుకొత్తూరు: సముద్రం నుంచి లభించే మత్స్య సంపద నుంచి విలువ ఆధారిత ఆహార పదార్థాలు తయారు చేసేలా షెడ్యూల్డ్ తెగల మహిళలు దృష్టి సారించాలని కేంద్ర మత్స్య సాంకేతిక సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదనరావు అన్నారు. గురువారం వజ్రపుకొత్తూరు మండలం పూండి–గోవిందపురంలో ఐసీఏఆర్–సీఐఎఫ్‌టీ ఆధ్వర్యంలో సముద్ర ఉత్పత్తుల నుంచి ఆహార పదార్థాలు తయారు చేయడంపై 20 మంది ఎస్టీ మహిళలకు ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. వంటల్లో సాంకేతిక అనుభవం ఉన్న సిబ్బందిని రప్పించి శిక్షణ ఇప్పించారు. ముగింపు నాడు చేపలతో చేసే ఆహార పదార్థాలను ప్రదర్శించారు. నాణ్యమైన ఎండుచేపల ఊరగాయ, ఫిష్ ఫింగర్స్, రొయ్యల పొడితో చట్నీ తయారీలో మెలకువలు నేర్పించారు. అనంతరం వ్యాపారానికి అవసరమయ్యే కుక్కర్స్, స్టవ్, వంట పాత్రలు, ఇతర కిట్లు పంపిణీ చేశారు. కంసు నిర్మల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మత్స్య సాంకేతిక సంస్థ సీనియర్ శాస్త్రవేత్త పి.విజి, సాంకేతిక సిబ్బంది సుశీల మెహర్, కేదార్ మెహర్ తదితరులు పాల్గొన్నారు.

'కళ్లను పరిరక్షించుకోవాలి'

కంచిలి: ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొల్లూరు పంచాయతీ పరిధి కర్తలి గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ దేవదాస్‌రెడ్డి ప్రారంభించారు. నేత్ర వైద్య సహాయకుడు వి.కిరణ్‌కుమార్ 80 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి మందులు ఇవ్వగా, 20 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు.

మరో 12 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పైల లక్ష్మీనారాయణ, గణేష్, దాలయ్యరెడ్డి, భీమారావు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మందస: భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. మండలంలోని హరిపురంలో ఉన్న మార్పు గ్రంథాలయం ఆవరణలో మహాసభల పోస్టర్లు, కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25, 26వ తేదీల్లో శ్రీకాకుళంలోని కళింగ భవన్‌లో రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్, కార్యదర్శి దుర్గాశి గణేశ్, ట్రెజరర్ తాండ్ర ప్రకాశ్, ఉత్తరాంధ్ర పోరాట సమితి నాయకుడు కుత్తుమ ఢిల్లీరావు, ఆరుణోదయ కళాకారుడు అందాల కోటేశ్వరరావు, దళిత డప్పు కళాకారులు కూర్మారావు, పరమేశ్వరరావు, దాలయ్య, అప్పారావు, నారాయణ, దండాసి, లోకు తదితరులు పాల్గొన్నారు.

ఒడియా పాఠ్య పుస్తకాల విడుదల



ఒడిశా అధికారుల నుంచి పాఠ్యపుస్తకాలు తీసుకుంటున్న సత్యన్నారాయణ పాఢి తదితరులు

కవిటి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలో ఒడియా మీడియం చదువుతున్న 9, 10వ తరగతుల విద్యార్థుల కోసం 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఒడిశా ప్రభుత్వం ఒడియా భాషా సాహిత్య పుస్తకాలను గురువారం విడుదల చేసింది. బరంపురంలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) సభ్యులు, ఒడిశా డిప్యూటీ సెక్రటరీ సుభాష్ చంద్ర బెహరా నుంచి శ్రీకాకుళం జిల్లా ఒడియా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దుర్గాప్రసాద్ చౌదరి వీటిని అందుకున్నారు. సుమారు రూ.2లక్షల విలువైన ఈ పుస్తకాల్ని కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, మందస మండల విద్యావనరుల కేంద్రాలలో అందుబాటులో ఉంచనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఒడియా మైనార్టీ సంఘం నేత సత్యనారాయణ పాఢి, అపోటా ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి, రఘునాధగౌడ, దీనబంధు శ్రీపల్లవ, త్రిలోచన పొల్లాయి తదితరులు పాల్గొన్నారు.

పాటల పోటీలు నేడు

సోంపేట: మండలంలోని జింకిభద్ర రాజరాజేశ్వరి దేవాలయం హోమశాల ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజా కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనిలో భాగంగా శుక్రవారం జిల్లాస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.25,000, రూ.15,000, రూ.10,000 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 85007 18142 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శివయ్యకు సహస్ర దీపారాధన



ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో ఇందుకేశ్వర ఆలయం వద్ద గురువారం భక్తులు సహస్ర దీపారాధన చేపట్టారు. భక్తులు శివ మాలధారణ చేపట్టి 39 రోజులైన సందర్భంగా భక్తులు 1001 దీపాలు వెలిగించి శివయ్యను ప్రత్యేక పల్లకిలో కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. గురుస్వామి నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామపెద్దలు, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ఎంపీటీసీ నర్తు శాంతి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

- ఇచ్ఛాపురం రూరల్

సంక్షిప్తంగా..

350 మందికి కంటి పరీక్షలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 350 మంది చిన్నారులకు కంటి వైద్య పరీక్షలను గురువారం చేపట్టారు. సాయిశిరీషా పాఠశాల వేదికగా మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంటివైద్య నిపుణురాలు డాక్టర్ షీలా ధాంగరాజ్ చిన్నారులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు ఎస్.అప్పారావు, కార్యదర్శి తమ్మినాన మాధవరావు, భౌద్దభిక్షువు సిద్దార్ధ బంటి, డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, ఆర్.హేమాచలం, ప్రిన్సిపాల్ కె.భారతి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో జీవవైవిధ్యం

కంచిలి: నవధాన్యాలు సాగు చేయడం వలన భూమిలో జీవవైవిధ్యం పెరిగి, సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని తద్వారా భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ అన్నారు. మండలంలోని మండపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయం డివిజన్ యాంకర్ యశోద పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత మాదిన ధనుంజయ, వీఏఏ గంగరాజు, మండల యాంకర్ శివానందం, సిబ్బంది లోహిదాసు, తులసయ్య, ఐసీఆర్‌పీ కామరాజు పాల్గొన్నారు.

లావాదేవీలపై అవగాహన అవసరం

టెక్కలి: ఆర్థిక లావాదేవీలపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన అవసరమని స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.ఝాన్సీరాణి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న అంశాలపై ఎప్పటికప్పుడు పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కె.గిరిజాశంకర్, కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్, ల్యూక్‌పాల్, శ్రీనివాస పట్నాయక్, హేమరాజు, మల్లేశ్వరరావు, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి, పూండి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ టెక్కలి ఈఈ ఎ.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మెంటెనెన్స్ పనులు జరుగుతున్న కారణంగా ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధి వద్దనున్న 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రాజశేఖర్ తెలియజేశారు. ఫీడర్ పరిధిలోని వినియోగదారులు, ఆంజనేయపురం, మేఘవరం ఏరియాల్లో ఉన్న గ్రానైట్ వినియోగదారులు సహకరించాలని కోరారు.